కథ

# కోటి విద్యలు...

-అగస్త్యప్రగడ హేమంత

ధనుర్మాసపుటుదయంలో చలితో కలిసిన ఎండ వెచ్చవెచ్చగా కురుస్తోంది. బళ్లోంచి, ఆవురావురుమంటూ ఆకలితో పిల్లలొచ్చేసే వేళ కావడంతో హడావిడిగా వంట ప్రయత్నాలు పూర్తి చేసుకుంటున్నారు పల్లెటూరి ఇల్లాళ్లు కొందరు. అప్పటికే వంట ముగించేసిన అతివలు మాత్రం వీధి అరుగుల మీదకి చేరి కబుర్లు ప్రారంభించారు.

ఇంతలో.. నిశ్శబ్దంగా ఉన్న ఆ వీధంట మెళ్లోని గంటలు గలగల్లాడించుకుంటూ సాగిపోయిందో ఎద్దు బండి. 'పాతబట్టలకీ స్టీలు సామాన్లో' అంటూ బుట్ట నెత్తిన పెట్టుకుని అరుచుకుంటూ పోయిందో అమ్మాయి. ఐదునిమిషాలు ఆ దారంట ఎవరూ వెళ్లక నిశ్శబ్దమై పోయింది.

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ హఠాత్తుగా ఆ వీధిలోకి దూసుకొచ్చిందో పిల్లల గుంపు వేగంగా పరుగులెత్తగల సత్తా వున్న పిల్లకాయలు పరుగు పరుగున ఒచ్చి ఆడాళ్లు కూర్చున్న ఎత్తరుగుల మీదకి ఎక్కేసి నిలబడ్డారు. వెనకాలొచ్చిన చిన్నా చితకా పిల్లలు మాత్రం అరుగు మీద చోటు లేక మెట్లమీదనే ఆగిపోయారు.

పిల్లల హడావిడికి అరుగుల మీదున్న ఆడాళ్లు కూడా అప్రమత్తులై పోయారు.

"ఇదుగో! వీరమ్మక్కా.. పగటి వేషగాళ్లొస్తున్నారు. కూర తరవాతొండుకుందూ గాని..బేగా రా!" వీధరుగు మీంచి అరిచిందో పద్దెనిమిదేళ్ల అమ్మాయి. కేకందుకున్న నదరు వీరమ్మక్క ఎక్కడివక్కడే ఒదిలేసి వంటింట్లోంచి ఇవతల బడ్డం.. కనుమరుగయిపోతున్నకళలు కొన్ని అప్పుడప్పుడూ కనిపించేది పల్లెటూళ్లలోనే అనే విషయాన్ని నిజం చేస్తూ పగటివేషగాళ్లు ఆ ఇంటి ముందుకు రావడం .. రెండూ ఒకేసారి జరిగాయి.

వాళ్లు రావడం చూసి.. "ఒచ్చేశార్రోయ్.. ఒచ్చేశారొచ్చేశారు.." కుర్రకుంకలు కొందరు హుషారుగా అరిచారు.

"ఒరేయ్ .. సిరంజీవి పాట కట్టు .." గుంపులో కాస్త పెద్దగా వున్న కుర్రాడు పగటి వేషగాళ్లనుద్దేశించి అరిచాడు.

అది విన్న సత్తిగాడు హార్మోనియం మెట్ల మీద వేళ్లుంచి, గొంతు సవరించుకుని 'అబ్బ నీ తియ్యనీ దెబ్బ..' అంటూ పాటందుకున్నాడు. వీరిగాడు మద్దెల దరువేస్తూ వాడికి వంతపాడసాగాడు. పధ్నాలుగేళ్ల రామన్న ఆడవేషం కట్టాడు. పద్దెనిమిదేళ్ల సోమన్న మగవేషంలో ఉన్నాడు. ఇద్దరూ కాస్సేపు హీరో హీరోయిన్లుగా మారి పాటకనుగుణంగా కాళ్లూ, చేతులూ, ఒళ్లూ కదుపుతున్నారు. వాళ్ల స్టెప్స్‌కి పిల్లలు ఈలలు మొదలెట్టారు. పాటయిపోయింది.

"ఇంకో డేన్సు కట్టు.." అరుగు మీది ఆడాళ్లలోంచి అరిచారెవరో!

"ఎన్టీవోడి పాటాడు" మరో ఆడగొంతు ఆజ్ఞాపించింది.

వాళ్ళ ఆజ్ఞని శిరసావహిస్తూ వీరిగాడు పాటందుకున్నాడు.

వీరిగాడు మద్దెల దరువేస్తుంటే, రామన్న, సోమన్న జయమాలిని ఎన్టీయార్‌లయిపోయారు. రెండో పాట పూర్తయ్యింది.

ఈసారి ఇక ఎవరూ ఏమీ అడగలేదు. అందరి మొహాల్లోనూ వినోదాన్నందుకున్న తృప్తి, ఆనందం కనిపిస్తున్నాయి. ఆ నలుగుర్లోకీ పెద్ద సత్తిగాడు అందరి మొహాల్లోకీ చూశాడు. ఫర్వాలేదనిపించింది. పక్కనున్న-రామన్నకి కనుసైగ చేశాడు.

"అమ్మగారూ! సద్దెన్నం ఏమన్నా వుంటే రెండు ముద్దలెట్టండి" ఆడవేషంలో ఉన్న రామన్న అరుగుమీదనున్న ఆడాళ్ల నుద్దేశించి అడిగాడు.

"అయ్యో! సద్దన్నమా.. పొద్దున్నే పిల్లలు తినేశారు" జాలిగా అందొకావిడ.

"మీ ఇంట్లో ఉందంటే కనకం?" మళ్ళీ అదే గొంతు పక్కనున్న ఆమెని ప్రశ్నించింది.

"సల్దన్నం మాఇంట్లో ఎవరూ తినరు. సత్తెప్పింట్లో ఉంటాది" బదులిచ్చిందావిడ.

అందరి కళ్లూ సత్తెప్ప కోసం చూశాయి. అప్పటికే గిన్నెలో అన్నం, పచ్చడీ వేసుకుని ఇంట్లోంచి ఇవతలకొచ్చింది సత్తెప్ప. గిన్నె నిండుగా వచ్చిన అన్నాన్ని మెరుస్తున్న కళ్ళతో చూసి దాన్ని భద్రంగా జోలెలో పెట్టాడు వీరిగాడు.

నలుగురూ కదిలారు. యధాప్రకారం వాళ్ళతో కాస్త ముందువెనుకలుగా పిల్లలూ కదిలారు.

అలా.. పగటివేషగాళ్ళతో మధ్యాహ్నం పన్నెండయే వరకూ పిల్లలూ ఇల్లిల్లూ తిరిగారు. కడుపులో ఎలకలు గడబిడ చేయడంతో కుర్రకుంకలంతా మెల్లమెల్లగా ఒక్కొక్కరే ఇళ్లకు జారుకున్నారు. అప్పటికే అలసిపోయిన నలుగురూ తాము బస చేసిన పెద్ద కాపు కొబ్బరికొట్టు అరుగు మీదకి చేరుకున్నారు.

"వణ్ణం చాలా వచ్చినట్లుందే" హార్మోనియం తీసి అరుగు మీద ఓ మూలకి పెడుతూ అడిగాడు సత్తిగాడు.

"ఆ.. నీళ్లలో వేసి ఎచ్చజేసుకుంటే సందాలక్కూడా సరిపోద్ది" సంతోషంగా అన్నాడు వీరిగాడు.

అప్పటికే ఊడూడి పోతూ కాళ్లకి అడ్డం పడుతున్న చీరెని పీకి పక్కన పడేసి హాయిగా ఒళ్లు విరుచుకున్నాడు రామన్న. వంట పని తనదే కనుక గబగబా నాలుగు చితుకులు ఏరి తెచ్చి, పొయ్యి రాజేసి, సత్తుగిన్నెలో నీళ్లు పోసి, దాన్ని పొయ్యి అనబడే మూడు ఇటుకల మీదా పెట్టి అప్పుడే ఒంటిమీది మిగిలిన బట్టలు కూడా ఒక్కొక్కటే ఒల్చుకోవడం మొదలెట్టాడు.

అప్పటికే బట్టలు మార్చేసుకుని ముఖానికున్న పౌడర్ కడిగేసుకున్న సోముడు పొయ్యి దగ్గరికి చేరి మంట ఎగసం దొయ్యసాగాడు. "ఇయ్యాల కూరేం వండమంటావ్ సత్తెన్నా?" తలకి కట్టుకున్న సవరం పీకి పక్కన పడేసి రెండు చేతుల్తో బుర్రగోక్కుంటూ అడిగాడు రామన్న. "ఊరోళ్లేసిన ఊరగాయ ముక్కలున్నాయిగా! అయ్యేసుకుని తినేద్దాం. కూర సంగతి సందాల సూద్దాంలే!" చుట్ట ముట్టిస్తూ అన్నాడు సత్తిగాడు. "రేపేం ఏసం కడదాం" మరుగు తున్న నీళ్ళలో చద్దెన్నం వేస్తూ అడిగాడు వీరిగాడు.

"కిష్టుడు, జాంబవంతుడు" చెప్పాడు సత్తి.

"అయితే రేపు మనకి ఏసం లేదురోయ్ రామన్నా" హుషారుగా అన్నాడు సోముడు.

ఇంతలో వీరిగాడు చద్దన్నంలో వేడి నీళ్ళన్నీ వార్చెయ్యడంతో వంట పూర్తయ్యింది.నలుగురూ భోజనానికి ఉపక్రమించారు.

* * *

"నిన్న సందాళ ఊళ్లోకి సినిమావోళ్లు దిగారంట" వీర బ్రహ్మంగారి వేషం వేసుకుంటున్న సత్తికి సహాయం చేస్తూ అన్నాడు రామన్న.

"రానియ్యహె.. మనకేంటి?" అద్దంలో చూసుకుని గడ్డం అతికించుకుంటూ అన్నాడు సత్తిగాడు.

"అదికాదు.. ఏసం అయిపోయేకా నేనూ సోవన్నా ఎల్లి ఆల్లని సూసొద్దారనుకుంటన్నాం" మెల్లగా చెప్పాడు.

"అంతే కదా.. ఎల్లండి" అనుమతి నిచ్చేశాడు సత్తిగాడు. ఆ మాటకి సోముడి వైపు చూసి హుషారుగా కన్నెగరేశాడు రామన్న.

ఆ రోజు సత్తి, వీరబ్రహ్మం, వీరిగాడు సిద్దయ్యగా వేషాలు కట్టారు. రాముడూ, సోముడూ తబలా, హార్మోనియం పట్టుకున్నారు. నలుగురూ కలిసి వీధిలోకొచ్చారు.

రోజూ అరుగు దిగి వీధిలోకి రాగానే.. తమని పాలోమంటూ చుట్టుముట్టే పిల్లల గుంపు ఆ రోజు లేకపోవడం చూసి సత్తిగాడికి ఆశ్చర్యమనిపించింది.

"ఒరేయ్ ఈరిగా.. పిల్లోళ్ళందరూ ఏవయ్యారంటావ్?" అనుమానంగా అడిగాడు.

"ఆకలయి ఇళ్ళలో దూరుంటారు".

"కాదెహె.. సినిమా వోళ్ళ దగ్గిరి కెళ్ళిపోయేరు"

చెప్పాడు రామన్న.

సత్తిగాడు మాట్లాడలేదు.

అలవాటు ప్రకారం రోజూలాగే పెద్దకాపు గారింటి ముందుకొచ్చింది సత్తిగాడి బృందం. వీధితలుపులు వేసున్నాయి. అయినా సత్తి సంశయించలేదు. బ్రహ్మంగారి 'కాలజ్ఞానం' అందుకున్నాడు రాగయుక్తంగా. ఐదు నిమిషాలు గడిచాయి. సిద్ధయ్య సందేహాలూ, బ్రహ్మంగారి కాలజ్ఞానం పూర్తయిపోయింది. తలుపులు మాత్రం తెరుచుకోలేదు.

తను గొంతు విప్పగానే భళ్ళున తెరుచుకునే పెద్ద కాపు గారింటి తలుపులు ఆ రోజెందుకు మూసుకుని ఉన్నాయో సత్తిగాడికి అర్థం కాలేదు. తన అనుచరుల వైపు అయోమయంగా చూశాడు. వాళ్ళకీ ఏమీ అర్థం కాలేదు కనుక.. మిగిలిన ముగ్గురి ముఖాల్లోనూ అదే భావం కదలాడింది.

"ఏంటీ .. ఇంట్లో ఎవరూ లేరంటావా?" అడిగాడు సత్తిగాడు.

వీరిగాడు ఏదో జవాబు చెప్పే లోపలే పెద్దకాపు గారి సందు తలుపు కిర్రున చప్పుడు చేస్తూ తెరుచుకుంది. పన్నెండేళ్ళ పిల్ల గుప్పెటతో బియ్యం పట్టుకుని ఇవతల కొచ్చింది. రామన్న జోలె పట్టాడు. పిడికెడు బియ్యం అందులో పడ్డాయి.


"పాపా! పెద్దకాపు వాళ్ళింట్లో ఎవరూ లేరా?" ఉండబట్టలేక అడిగేశాడు సోమన్న.

"లేరు! సినిమావోళ్ళని సూట్టా కెళ్ళారు." చెప్పి లోపలికెళ్ళి తలుపేసిందా పిల్ల.

ఉసూరుమని నిట్టూర్చి, అంతా పక్కింటివైపు కదిలారు. ఆ ఇంటి తలుపులూ వేసేసే ఉన్నాయి. సిద్ధయ్య వేషం కట్టిన వీరిగాడు పాటందుకోవడానికి సంశయించాడు. సత్తి గాడు కనుసైగ చేయడంతో ఇక తత్త్వం పాడక తప్పింది కాదు. కానీ ఆ ఇంటి తలుపూ తెరుచుకోలేదు. అలా ఒకటికాదు... రెండు కాదు దాదాపు వీధంతా నిర్మానుష్యంగా అయిపోయింది. ఏ ఇంట్లోనూ అలికిడి లేదు. అంతా సినిమా వాళ్ళని చూడ్డానికి వెళ్లి పోయారు.

వేషాల్తో వీధులు తిరుగుతున్న నలుగుర్నీ నిరాశ ఆవరించుకుంది. ఏ ఇంట్లోనూ జనంలేరు. అందువల్ల ఆరోజు వాళ్ళ కడుపు నిండడానికి కావలసిన చద్దనం కానీ బియ్యం కానీ రాలేదు.

సత్తిగాడి మనసులో అలజడి మొదలయింది. అయినా దాన్ని బయట పడనివ్వకుండా అడుగులు ముందుకేస్తున్నాడు. మిగిలిన ముగ్గురూ అతన్ని అనుసరిస్తున్నారు.




తిరిగి తిరిగి నలుగురూ... ఆడాళ్లు కూచునే ఎత్త రుగుల ఇల్లు చేరు కున్నారు. రోజూ అతివలతో కళ కళ్ళాడుతూ ఉండే ఆ అరుగులు రెండూ ఆరోజు నిశ్శ

బ్బంగా వెల వెలబోతున్నాయి. "ఈ ఆడోళ్ళు కూడా ఎలిపోయినట్టున్నారు" గొణిగాడు సోముడు.

ముగ్గుర్లో ఎవరూ మాట్లాడలేదు.

ఎత్తురుగుల ఇంటి ముందు కొచ్చి ఆగారు.లోపల హడావిడి వినిపిస్తోంది. బిరియానీ ఒండుతున్న వాసన గుమ్మెత్తి పోతోంది. ఆ సువాసన ముక్కు పుటాల్ని తాకుతుంటే నలుగురికీ నోట్లో నీళ్లూరాయి.

"లోపల మనుసులున్నారు" ఆనందంగా అన్నాడు వీరిగాడు.

సత్తిగాడు గొంతు సవరించుకుని పాటందుకున్నాడు. "ఆకాశము ఎర్రనగును ... ఆరుమతములు ఒక్కటగును..." రాగయుక్తంగా కాలజ్ఞానం పాడుతున్నాడు. ఐదే నిమిషాలుగడిచాయి. లోపల్నుంచి ఓ ముసలావిడ - ఒంగిపోయిన నడుం మీద చెయ్యేసుకుని మెల్లగా నడుచుకుంటూ వీథిలోకొచ్చింది. కళ్ళకి అరచేతిని అడ్డుపెట్టుకుని ఐదునిమిషాలపాటు చూసింది. "ఏ యేసం కట్టారియ్యాల?" వాళ్ళని గుర్తు పట్టి అడిగింది.

"ఈర బెమ్మంగారు" ఠక్కున చెప్పాడు సోముడు.

"మావోల్లంతా అడావిడిగా ఉన్నారు. సినిమావోల్లకి ఒంటలు సేత్తన్నారు. ఆల్లకియ్యాల ఇక్కడే బోయనాలు. కోళ్లి కూడా కోసేరు. ఉప్పుడు గార్లేత్తారు... ఆల్లెవరికీ సేతులు కాలీ లేవు.. నేను సూసేను కదా! ఎలిపొండి..." ఒణకుతున్నకంఠంతో పాఠం చదివిందాముసలమ్మ. అక్కడితో ఆగకబొడ్లో దోపిన పైట కొంగు ఇవతలకి లాగి దాని చివర్నున్న ముడివిప్పి అందులో భద్రంగా ఉన్న పదిపైసల బిళ్ళతీసి రామన్న చేతిలో వేసి... లోపలికెళ్లిపోయింది.

పదిపైసల బిళ్ళని ఓసారి అటూ ఇటు తిప్పిచూసి జేబులో వేసుకున్నాడు రామన్న. సత్తిగాడి ముఖం నల్ల బడింది. నీరసం నిస్సత్తువా కమ్ముకోగా కాళ్ళీడ్చుకుంటూ తమ బసవైపు దారి తీశాడు.

ఒచ్చీరాగానే పొయ్యిమీద నీళ్ళు పెట్టి తమ దగ్గరున్న మూటలన్నీ వెదికి చిన్న గుడ్డమూటని బయటకితీశాడు రామన్న. అవి అప్పుడెప్పుడో ఊరి మీద కెళ్ళినప్పుడు ఒచ్చిన బియ్యం. మూట విప్పివాటిని ఎసట్లో పోశాడు.

చూస్తున్న సత్తిగాడి మనసు విలవిల్లాడిపోయింది.

పూర్వం, పగటి వేషగాళ్ళంటే ప్రజల్లో ఒకింత ఆదరణ, గౌరవం ఉండేవి. వాటి సాయంతోనే తమ పూర్వీకులు ఒక ఇల్లు ఒకింత భూమి సమకూర్చుకో గలిగేవారు. పగటి వేషాలు కట్టడానికి ఊళ్ళలోకొచ్చి ఎవరో ఒకరి అరుగు మీద బసచేసేవారు. ఉన్న పది రోజులూ వేషాలేసి ఆఖర్న బహుమతులందుకునేవారు.

ఈ పదిరోజుల్లోనూ తినే తిండంతా తమసొంత ఖర్చులతోనే భరించుకోగలిగేవారు. అది అప్పటి పరిస్థితి. అప్పట్లో పగటివేషగాళ్ళంటే... వాళ్ళూ కళాకారులకిందే లెఖ్క. మరి ఇప్పుడో? తమ పరిస్థితి బిచ్చగాళ్ళకంటే హీనంగా తయారయింది. వేషం కట్టి ఊరిమీద కెళ్ళినప్పుడు ఎవరైనా దయదల్చి ఇంత అన్నమో, ఇన్ని బియ్యమో, ఓ రూపాయో అర్థో ఇస్తేనే తమకారోజు గడుస్తుంది. లేదంటే పస్తే. ఎంతలో ఎంత మార్పు?

ఆలోచిస్తున్న సత్తిగాడి మనసు బాధగా మూలిగింది. "అన్నా! అన్నం తిందువుగానిరా!" అన్న వీరిగాడి పిలుపుతో ఆలోచనల్లోంచి బయట పడి భోజనానికి లేచాడు సత్తిగాడు.

ఉన్న కాస్త అన్నాన్నే నలుగురూ తలోముద్దా పంచుకుతిన్నారు. కడుపులు నిండలేదు గానీ పస్తు లేదన్న తృప్తి మిగిలింది. భోజనం పూర్తి చేసి బట్టల మూట తలకింద పెట్టుకుని నిద్రకి ఉపక్రమించాడు సత్తిగాడు.

* * *

ఎవరో తన భుజం పట్టి గట్టిగా కుదపడంతో గాఢ నిద్రలో ఉన్న సత్తిగాడికి చటుక్కున మెలకువొచ్చింది. కళ్ళు తెరిచి చూసేసరికి ఎదురుగా రామన్న.

"లే అన్నా! టీ తాగుదూగాని" అతను కళ్ళుతెరవడం చూసి చెప్పాడు.

"టీయా! ఎక్కడిది?" ఆశ్చర్యంగా అడిగాడు.

"పెద్దకాపుగారింటికెడితే పోసేరు. సినిమావోళ్ళకి కాసింది మిగిలిపోయిందంట" సత్తుగ్లాసులోకి టీ వొంపుతూచెప్పాడు రామన్న.

ఓసారి దీర్ఘంగా నిట్టూర్చి రామన్న అందించిన టీ అందుకున్నాడు సత్తిగాడు.

"సందాల తిండెలాగా లేదు. కనీసం సినిమా వోళ్ళ నన్నా సూద్దాం! రా అన్నా!" టీ తాగుతూ అడిగాడు రామన్న.

"నేనెందుకులేరా! సిన్నోళ్ళు... మీరెల్లండి" చెప్పాడు సత్తిగాడు.

"కాదు! నువ్వొరా... అందరం కలిసే ఎల్దాం" రామన్న మారాంచేశాడు. సత్తిగాడు కాదనలేకపోయాడు.

అందరూ టీలు తాగి సినిమా షూటింగ్ జరుగుతున్న నాయుడు గారి తోటకేసి కదిలారు. వాళ్ళక్కడికి చేరుకునే సరికి చూట్టూ ఇసకేస్తే రాలనంత జనం.. నాయుడుగారి తోటలో నేల ఈనినట్టుగా - ఉన్నారు. ఆ మధ్యలో ఎక్కడో ఉన్నారు సినిమా వాళ్ళు. అడ్డుగా ఉన్నజనాన్ని తొక్కుకుంటూ తోసుకుంటూ ఎలాగైతేనేం ముందున్న నాలుగో వరసలోకి చేరుకుంది సత్తిగాడి బృందం. అక్కడికి సినిమా వాళ్ళు చాలా స్పష్టంగా కనిపిస్తున్నారు.

తలమీద టోపీ పెట్టుకున్న ఒకాయన హీరోయిన్‌తో ఏదో చెబుతున్నాడు. ఆయన చేతిలో కాయితాలున్నాయి. ఆమె తల ఊపుతోంది. కళ్ళజోడు పెట్టుకున్న ఒకాయన కూర్చుని అంతా చూస్తున్నాడు. ఆయన నిర్మాత అన్న విషయం వాళ్ళకి తెలియక పోయినా సినిమావాడు కనుక ఆయన్ని కూడా వింతగా, కళ్ళు విప్పార్చుకుని మరీ చూశారు.

ఐదునిమిషాలు గడిచాయి. ఎక్కణ్ణుంచో "కేమేరా స్టార్ట్! "అన్నకేక వినిపించింది. అంటే ఏవిటో రామన్నకి అర్థ కాలేదు. అమాటే సత్తిగాణ్ణి అడిగాడు. "ఏమో? నాకూ తెలీదు" అన్నట్టుగా పెదవి విరిచాడు సత్తి. రామన్న మళ్ళీ అటు చూడ సాగాడు. హీరోయిన్ నడుము ఊపుతూ చేతులు తిప్పుతూ పెదాలు కదుపుతూ రెండుగంతులేసింది పక్కనుంచి వినిపిస్తున్న పాటకి అనుగుణంగా.

"కట్!" అన్న అరుపు వినిపించింది. ఆమె ఆగిపోయింది. మళ్ళీ - "స్టార్ట్" వినిపించింది. హీరోయిన్ మళ్ళీ గంతులు మొదలెట్టింది. అచ్చంగా ఇందాక చేసినట్టే! మార్పేమీ లేదు. మళ్ళీ కట్ అన్న అరుపు. అలా ఒకసారి కాదు. రెండుసార్లు కాదు. ఇంచుమించు పది సార్లు. ఆఖరికి పదోసారి.. 'కట్.. ఒకే!' వినిపించింది,

హీరోయిన్ వెళ్లి కుర్చీలో కూర్చుంది. ఎవరో ఒచ్చి ఆమెకి ఎండ తగులకుండా గొడుగు పట్టుకున్నారు. మరొకరు ఆమెకి విసనకర్రతో విసురుతున్నారు. ఒకతను అద్దం చూపిస్తుంటే ముఖానికి పట్టిన చెమటల్ని నాజూగ్గా అద్దుకొని మేకప్ సరిచేసుకుందామె. ఇంతలో ఎవరో టీలు పట్టుకొచ్చారు. చూస్తున్న రామన్నకి విసుగొచ్చింది.

"సూటింగంటే ఇదేనా?" పక్కనున్న సత్తిగాణ్ణి అసహనంగా అడిగాడు.

"ఇదే కామోసు" చెప్పాడు సత్తిగాడు.

"ఎలిపోదాం! కాళ్లు లాగుతున్నాయి" రామన్న గొణిగాడు.

మిగిలినవాళ్లకు కూడా షూటింగ్ పట్ల పెద్దగా ఆసక్తి లేకపోవడంతో అంతా కలసి గుంపులోంచి బయటపడ్డారు.

"ఆల్లలా ఎండలో పడి ఎగురుతున్నారు కదా! ఎందుకంటావ్?" దార్లో తన సందేహాన్ని బయట పెట్టాడు రామన్న.

"ఎందుకేంటి? డబ్బొస్తుంది!" చెప్పాడు సత్తిగాడు.

"ఎంత?"

"ఏమో?.. ఇవ్వచ్చులే! ఏలో.. లచ్చలో"

"మరి మనమూ ఎండ్లో ఎగురుతున్నాము కదా! అచ్చంగా ఆల్లు ఏసిన గంతులే మనవూ ఏత్తన్నాం కదా! మరి ఏ వూళ్ళోనైనా ఆఖర్రోజులలో మనకు ఐదురూపాయలకు మించి ఎవ్వరూ ఇయ్యరేం?" అనుమానంగా అడిగాడు.

ఆ మాటకి సత్తిగాడికి నవ్వొచ్చింది. అది నిస్సహాయతతో కూడిన నవ్వు నవ్వాడు. నవ్వి అన్నాడు.-

"ఎర్రోడా.. ఆల్లు సినిమావోల్లు. అందుకే ఆల్లకి డబ్బెక్కువిస్తారు. ఆల్లంటే అందరికీ మోజే! మనం పగటేసగాల్లం. మన మీద ఎవరికీ అంత మోజుండదు. ఆల్లకీ మనకీ సాలా తేడా వుంది!" చెప్పాడు.

"ప్చ్! ఆల్లూ కడుపుకోసమే ఏసం కడతన్నరు. మనవూ కడుపు కోసమే ఏసాలేత్తన్నాం. కానీ.. ఆల్లు ఒక్కసారి ఏసం కడితే సాలు! జీవితాంతం హాయిగా బతికేయగల్రు. కానీ మనం రోజూ ఏసం కట్టినా ఒక్కో రోజు పస్తులే.. ఎంటో!" అర్థం కానట్టుగా అన్నాడు రామన్న.ఆ మాటలకి సత్తిగాడికి నవ్వొచ్చింది. కడుపు నింపలేని తమ కులవృత్తి గుర్తొచ్చి బాధేసింది. ఆ బాధలోనే అనిపించింది– "కోటి విద్యలూ కూటి కోసమే అయినా, వాటిలో కడుపు నింపేవి కొన్ని మాత్రమే-" అని. ఆ మాట మనసులోనే అనుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు సత్తిగాడు.

**అనంతరామలక్ష్మి**



రాజమండ్రి ఇన్నర్ వీల్ అధ్యక్షురాలుగా శ్రీమతి పట్టపగలు అనంతరామలక్ష్మి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రోజు రోజుకి పెరిగిపోతున్న జనాభా సమస్యను విపులీకరించి గ్రామ ప్రాంతాలలో వారికి చెప్పి కుటుంబనియంత్రణ ఆపరేషన్స్ సర్వ ఖర్చులు భరించి చేయిస్తున్నారు. స్థానిక ఆనంవెంకటప్పారావు రోడ్ బస్ షెల్టర్, వృద్ధులకు నిరంతర అన్న వస్త్రదానం, బీద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. - సత్యమూర్తి